# తొలి నిర్ణయం

**"బతికినన్నాళ్ళూ** మారాజులా బతికాడు. కాలం తీరిపోయింది వెళ్ళిపోయాడు... ప్చ్... సహాయపడటమే తప్ప ఏనాడు ఎవర్నీ అర్థించి ఎరుగడు. చేసుకున్న పుణ్యం ఉత్తినే పోతుందా? అది నీకు నీ పిల్లలకు శ్రీరామరక్ష" ఓదార్పుగా అన్నది అలివేణి.

"పోయినవాళ్ళతో మనమూ పోలేం. వాళ్ళ తీపిగుర్తుల్ని మననం చేసుకోవడం మినహా మనకు మరో గత్యంతరం లేదు. గుండె దిటవు చేసుకోండి" ఊరడించింది ఉమాదేవి."

"చెట్టంత బిడ్డ అండగా ఉండగా చింతపడటం దండగ. కొడుకు చెంతన శేష జీవితం గడిపేయండి" ధైర్యం నూరిపోసింది అపర్ణ.

ఎవరెన్ని విధాల సముదాయిస్తున్నా సీతామహాలక్ష్మమ్మ గుండె మాత్రం స్థిమితపడటం లేదు. భర్త స్మృతులే అనుక్షణం గుర్తుకొస్తున్నాయి.

చీకటిపడింది. పరామర్శకొచ్చిన వాళ్ళొక్కొక్కరూ మెలమెల్లగా జారుకుంటున్నారు.

ఒంటరిగా మిగిలింది సీతామహాలక్ష్మి.

"నువ్వొక్కర్తివి ఇక్కడ ఏం ఉంటావమ్మా. లేచి పెట్టెసర్దుకో" అన్నాడు మహేశ్ తల్లి వద్దకొచ్చి. మాట్లాడలేదు మహాలక్ష్మి.

మళ్ళీ మహేశే అన్నాడు, "కొంప ఉందికదా అని దాని చూరు పట్టుకుని వ్రేలాడనక్కర్లేదు. ఏదో రేటుకి అమ్మేస్తే సరిపోతుంది.

"ఔనత్తయ్యా. కన్నకొడుకు ఉండగా మీరొక్కరూ ఇక్కడుండటం బాగోదు. మీమాట అటుంచి లోకం మమ్మల్ని ఆడిపోసుకుంటుంది. మామాట విని బట్టలు సర్దుకోండి" పెనిమిటి మాటలకు వత్తాసు పలికింది కోడలు పిల్ల.

కొడుకు కోడలే కాదు. గత పన్నెండు రోజులై అంత అదేమాట అంటున్నారు.

అయితే మహాలక్ష్మమ్మ నోట్లోంచి ఏమాట ఊడి బయటపడటం లేదు. తల్లినిక ఒత్తిడి చేయదమిష్టంలేక నిర్ణయాన్ని ఆమెకే విడిచిపెట్టేసాడు మహేశ్.

కథలు చెబుతూ పిల్లల్ని నిద్రపుస్తోంది కోడలు.

సీతామహాలక్ష్మమ్మ మెలమెల్లగా గతంలోకి వెళ్ళింది.

★ ★ ★

పదోఏడు వచ్చేదాకా ఇంటివద్దే చదూకుంది సీతామహాలక్ష్మి. తర్వాత ఆమెను స్కూల్లో వేయాలనుకున్నాడు మాధవరావు.

తోటి పిల్లల పేర్లతో పోల్చి చూసుకుంటే తనపేరు తనకే ఎంతో ఎబ్బెట్టుగా తోచింది సీతామహాలక్ష్మికి. "బడిలో పేరు వేయించేటప్పుడు గీతా అనిగాని సునీత అనిగాని వేయించమని నాన్నగారికి చెప్పమ్మా" అంటూ తల్లిని బ్రతిమలాడింది.

"నిక్షేపంలాంటి లక్ష్మిదేవి పేరు మానేసి గీతా రాతా ఏవిటే? ఈ ముక్క నాదగ్గరంటే అన్నావుగాని నాన్నగారితో అనబోకు చీరేయగలరు."

అమ్మ అదిలింపుతో ఆదిలోనే పేరు విషయంలో కన్నవాళ్ళతో రాజీపడక తప్పలేదు సీతామహాలక్ష్మికి.

అప్పటికే కాలంలో ఎన్నో మార్పులొచ్చేస్తున్నాయి. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు కూడా సైకిళ్ళు తొక్కుతున్నారు. మోటారు వాహనాలు నడుపుతున్నారు.

క్లాసులో కొందరాడపిల్లలు డ్రస్సులు వేసుకోవడం చూసి తనకు ఒక డ్రస్సు కుట్టించమంది.

"నీకేమైనా మతిపోయిందా? మగరాయళ్ళలా ఆ డ్రస్సులు ఏం బావున్నాయని?... పరికిణి వోణీలో వున్న అందం ఆ డ్రస్సుల్లో ఎక్కడుంది? పోను పోను నీ బుద్ధి పెడదారిపడుతోంది."

తల్లి పెట్టిన చీవాట్లతో చిరువయసులోనే ఆ చిన్నారి కోరికకు తెరపడిపోయింది.

ఫస్టు మార్కులకోసం పట్టుదలగా చదివింది. యస్.యస్.సి. ఫస్టుక్లాసులో పాసైంది.

అత్తెసరు మార్కులతో పరీక్ష అయిందనిపించిన వాళ్ళంతా కాలేజీలకు ఎగబడుతున్నారు. అటు వంటప్పుడు తను చేతులు ముడుచుకుని కూర్చోవడంలో అర్థం లేదనిపించింది. అందుకే తండ్రితో ఇంటర్‌మీడియట్ చదువుతానంది.

"చదివిన చదువు చాల్లెండి. అది ఆడమన్నట్లు ఆడుతూ పోతే రేపు బెయ్యే కూడా చదువుతానంటుంది. అప్పుడు దానికి మనం ఎమ్మే మొగుడ్ని ఎక్కడనుండి తెస్తాం? నామాట విని ఇకనుండైనా సంబంధాలు చూడండి. రెండోది అప్పుడే పయిటవేసుక్కూర్చుంది. పెద్దపిల్ల నెత్తిమీదైనా రెండక్షింతలు పడకపోతే లోకం దుమ్మెత్తిపోస్తుంది."

అమ్మమాటకు అరికాలు మంట తలకెక్కింది సీతామహాలక్ష్మికి. ఎలాగైనా సరే అమ్మని నాన్నని తనదారికి తెచ్చుకోవాలనుకుంది. అనుకోవడమే తడు ఆదిసగా ప్రయత్నాలు ప్రారంభించింది.

చదువుకుంటానంటూ పేచి పెట్టింది. సత్యాగ్రహం చేసింది. సహాయ నిరాకణ చేపట్టింది. అయినా వాళ్ళు ఎంతకు దిగిరాకపోవడంతో చదువు విషయంలో కూడా రాజీపడక తప్పలేదు.

పెళ్లిచూపులు మొదలయ్యాయి.

చదువు బాగా తక్కువని కొన్ని సంబంధాలు, ఉద్యోగం చేయడం లేదన్న మిషతో మరికొన్ని సంబంధాలు వచ్చినట్లే వచ్చి తప్పిపోయాయి.

ఎంత కట్నం పోసైనా ఆఏడు కూతురు పెళ్లి జరిపించేయాలనుకున్నాడు మాధవరావు. అయితే ఏది కుదరడం లేదు.

కట్నాలు ఇచ్చేవాళ్ళు ఉన్నంతకాలం ఈ వ్యవస్థలో పుచ్చుకునే వాళ్ళు ఉంటూనే ఉంటారు. దానికి ఫుల్‌స్టాప్ ఇచ్చేవాళ్ళు పెట్టాలి తప్ప పుచ్చుకునేవాళ్ళు కాదు. ఆ డబ్బు అలా పెళ్లికోసం కాకుండా చదువుకి వెచ్చిస్తే ఎంత బావుండేది? అనిపించింది.

సీతామహాలక్ష్మికి తన ఆశయం మెడిసిన్ చదవడం. డాక్టరై పేరు ప్రఖ్యాతులు గడించడం. అయితే అందుకు భిన్నంగా ఒక ప్రయివేటు హాస్పటల్లో కంపౌండరుగా పనిచేసే వ్యక్తిని పెళ్ళి చేసుకోవలసి వస్తుందని ఏనాడు అనుకోలేదు.

"మేం ఇంతకన్నా మంచి సంబంధం తేలే'మంటూ మెడవంచి తాళి కట్టించారు.

ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నా అపురూపంగా చూసుకుంటున్న భర్త దొరికినందుకు ఆ జీవితంతోనే రాజీపడిపోయింది.

ఏడాది తిరగకుండానే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది.

తనకు డాక్టరు అయ్యేయోగం ఎలానూలేదు. కొడుకునైనా బాగా చదివించి డాక్టర్ని చేయాలనుకుంది. వాడు యం.బి.బి.యస్. పాసైతే తనే డాక్టరైనంతగా సంబరపడిపోవాలనుకుంది. ప్చ్... ఆ కోర్కెనా నెరవేరుతేనా?... 'అంత పెద్ద చదువు మనమేం చెప్పించ గలం' అంటూ భర్త నుండి ప్రతిఘటన ఎదురైంది.

డిగ్రీపూర్తి అవడంతోనే మెడికల్ రిప్రజెంటిటివ్‌గా పోస్టింగ్ వస్తే హైదరాబాదు వెళ్ళిపోయాడు మహేశ్.

అందం, చదువు, హోదా అన్నీ వున్న బిడ్డకు చక్కని జోడీ కోసం వేట ప్రారంభించింది సీతామహాలక్ష్మి.

ఇలా ఉండగా తనో అమ్మాయిని ప్రేమించానని, అనివార్య పరిస్థితుల్లో మాట మాత్రమైనా చెప్పకుండా పెళ్లి చేసుకోవలసి వచ్చిందంటూ మహేశ్ దగ్గర నుండి ఉత్తరం వచ్చింది.

ఆ వార్తకు హతాసురాలైంది సీతామహాలక్ష్మి.

"అబ్బాయి తనకిష్టమైన అమ్మాయిని చేసుకున్నాడు. అయిందేదో అయిపోయింది. ఇప్పుడు మనం కోపతాపాలకుపోయి వాళ్ళను దూరం చేసుకునే బదులు పెద్దవాళ్ళుగా వాళ్ళని ఆశీర్వదించడం ఉత్తమం" అంటూ హితవు చెప్పాడు భర్త.

కొడుకు దగ్గర కొంతకాలం గడుపుదామని హైదరాబాదువెళ్ళి వాళ్ళమధ్య ఇమడలేక తిరిగొచ్చారు మాధవరావు దంపతులు.

వాళ్ళకు బిడ్డమీద పెంచుకున్న భ్రమలన్నీ తొలగిపోయాయి.

★ ★ ★

ఇంటి ముందినుంచి బ్యాండు మేళాలతో పెళ్లి ఊరేగింపు వెళ్ళడంతో గతంలోంచి బయటపడింది సీతామహాలక్ష్మి. జీవితంలో ప్రతి విషయంలోను రాజీపడుతూనే వచ్చింది. నిజానికి తన బ్రతుకే రాజీ బ్రతుకైపోయింది.

కొడుకు వద్దకు భర్తతో వెళ్ళినప్పుడు ఆశించిన గౌరవం దక్కలేదు. ఇప్పుడు లోకంతో రాజీపడి తనకు తానుగా బిడ్డదగ్గరికెళితే ఇంకెన్ని అవమానాల్ని మోయవలసి వస్తుందో?... వద్దు... కష్టమో నష్టమో తన గూట్లో పడుంటేనే రవంత మనశ్శాంతి. ఇక ఎవరు ఎంత వత్తిడి చేసినా రాజీపడకూడదన్న నిర్ణయానికొచ్చేసింది. జీవితంలో తనకు తానుగా తీసుకున్న తొలి నిర్ణయమది–

"నేను మీ నాన్నగారి జ్ఞాపకాలతో ఈ వూళ్ళో ఈ ఇంట్లోనే వుంటాను..." అని కొడుక్కి ఖచ్చితంగా చెప్పింది.

**(మే 2000, ఆంధ్రభూమి మంత్లీ)**